క్లుప్తంగా

ఘనంగా గణేష్ నిమజ్జనం


గణపతి లడ్డూతో గోపాల్‌నాయుడు, కుటుంబీకులు

పాకాల : న్యూ కాలనీ, సంతగేటు వీధి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను శనివారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా న్యూకాలనీలో వినాయకస్వామి లడ్డూని వేలం వేయగా గోపాల్‌నాయుడు రూ.42,216లకు దక్కించుకున్నారు. అనంతరం గణపతి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.

'ప్రాపర్టీ ఎక్స్‌పో'కు విశేష స్పందన


చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : డీబీఆర్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పోకు రెండో రోజు శనివారం విశేష స్పందన లభించింది. ఈ ప్రదర్శనలో వివిధ కంపెనీల ఆధ్వర్యంలో 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేసి తిలకించారు. తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ రాజు , క్రెడాయ్ చైర్మన్ గోపీనాథ్, రాంప్రసాద్, రాజేష్‌కుమార్, వాసుదేవన్, మల్లిశెట్టి రవి, సత్యనారాయన, బాలాజీ, కిరణ్, చక్రపాణి, వాకా ప్రసాద్ పాల్గొన్నారు.

14న బలిజసేన సమావేశం


మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

తిరుపతి కల్చరల్ : నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు బలిజసేన రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బలిజ, కాపు, తెలగ, ఒంటరి సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. నేతలు బెల్లంకొండ సురేష్, కేఎస్ ప్రసాద్, ఆముదాల వెంకటేష్, బసికర్ల రఘు, సుబ్రమణ్యం, రామారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

తిరుపతి అర్బన్ : జిల్లాలో పలు ప్రాంతాల్లో తలెత్తిన శ్మశాన స్థల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు. శనివారం ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ నరసింహులకు వినతిపత్రం అందించారు.

నోటీస్ బోర్డు

- శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఉదయం 9.30 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం, మధ్యాహ్నం 3 గంటలకు చంద్రగ్రహణం సందర్భంగా ఆలయం మూసివేత.
- డీబీఆర్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో.
- నరసింహ తీర్థం రోడ్డులోని ఆఫీసర్ క్లబ్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మీడియా సమావేశం.
- యూత్ హాస్టల్‌లో ఉదయం 10 గంటలకు ఐఎన్‌టీయూసీ నూతన కమిటీల పరిచయం .
- కంచికామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి, సత్యచంద్రశేఖర్ సరస్వతి స్వామి వారు చాతుర్మాస వ్రత దీక్ష విరమణ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు కంచి కామకోటి మహా పాదుకా మండపం నుంచి దివ్యారామం ఉద్యానవనం వరకు విశ్వరూప యాత్ర.

అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష చంద్రమౌళిరెడ్డి, రవిచంద్రారెడ్డి తదితరులు , పోస్టర్ ఆవిష్కరిస్తున్న హర్షిత్ రెడ్డి తదితరులు




సాగు..వెనకడుగు!

- రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ పేరిట వంచన
- యూరియా కూడా అందించలేని దుస్థితిలో బాబు సర్కార్
- బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న ఎరువులు
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 9న అన్నదాత పోరు
- పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

'ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకోరు. గుప్పించిన హామీలను నెరవేర్చరు. అయితే వ్యవసాయం దండగ అనే ప్రకటనకు మాత్రం ఎప్పటికీ కట్టుబడి ఉంటారు. రైతులను ఇబ్బంది పెట్టేలా పాలసీలు తీసుకువస్తుంటారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంబరంగా సాగిన పంటల సాగును కుట్రపూరితంగా వెనకడుగు వేయించారు. ముందుగా అన్నదాత సుఖీభవ పథకం పేరుతో వంచనకు తెర తీశారు. రూ.20వేలు ఇస్తామని తూతూమంత్రంగా రూ.5వేలు జమ చేసి చేతులు దులిపేసుకున్నారు. కనీసం యూరియాను కూడా అవసరాల మేరకు సరఫరా చేయకుండా అన్నదాతను అవస్థల పాలు చేశారు' అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మండిపడ్డారు.

తిరుపతి మంగళం :కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అడుగడుగునా రైతులను చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం తిరుపతి పద్మావతిపురంలోని తమ నివాసం వద్ద ఈనెల 9వతేది నిర్వహించనున్న ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు పోస్టర్‌ను మేయర్ డాక్టర్ శిరీష, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, రైతులు, నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రైతులకు ఎప్పుడూ కష్టాలేనని, పంటలు పండక, గిట్టుబాటు ధరలు లేక అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న పాలనలో రైతులకు రైతు భరోసా అందించామని వెల్లడించారు. అయితే ఎన్నికల్లో తాము గెలిస్తే రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ. 20వేలు ఆర్థిక సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి రెండేళ్లకు గాను కేవలం రూ. 5వేలు ఇచ్చి మోసం చేశారన్నారు. నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పి అధికారంలోకి రాగానే హామీలను గాలికి వదిలేశారని విమర్శించారు. రైతులు ఏ సీజన్‌లో ఎంత మేర పంటలు పండిస్తారు, అందుకు ఎంత యూరియా అవసరం ఉంటుందనే విషయం ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. పంటలు కోతకు వస్తున్నా రైతులకు యూరియా అందడం లేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాము ఎప్పుడూ రైతుల పక్షాన నిలబడతామని, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు.ఈనెల 9వతేది ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతులకు అండగా తిరుపతి అన్నమయ్య సర్కిల్ నుంచి శాంతియుతంగా ర్యాలీ చేపడుతున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సయ్యద్ షఫీ అహ్మద్‌ఖాదరీ, అజయ్‌కుమార్, నల్లాని బాబు, కోటాల చంద్రశేఖర్, తలారి రాజేంద్ర, వాసుయాదవ్, ముప్పాల సాయికుమారి, సలీమ్‌బాష, పుష్పాలత పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో..

తిరుపతి రూరల్ : రైతుల సమస్యలపై ఈ నెల 9వ తేదీన చేపట్టనున్న ×అన్నదాత పోరు₹ పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మల్లం చంద్రమౌళిరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆవిష్కరించారు. శనివారం ఈ మేరకు తుమ్మలగుంటలోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కనీసం యూరియా కూడా సరఫరా చేయలేని దుస్థితిలో సర్కారు ఉందని మండిపడ్డారు. సాగుకు ముందే రైతులకు పెట్టుబడి సాయం అందేలా జగనన్న ప్రభుత్వం చర్యలు చేపడితే, కూటమి సర్కారు నాశనం చేసిందని విమర్శించారు. అన్నదాత పోరుకు పెద్దసంఖ్యలో రైతులు తరలిరావాలని కోరారు. నేతలు భాస్కర్ నాయుడు, వేణుగోపాల్ రెడ్డి, మారయ్య, శ్రీధర్, శ్రీనివాసులు రెడ్డి, మదన మోహన్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, కోటాల చంద్రశేఖర్ రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, శంకర్ యాదవ్, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, యశ్వంత్, అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, దేవారెడ్డి, కోటీశ్వర రెడ్డి, నవీన్ రెడ్డి, రఫీ, వినాయక పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు ఆదేశం


సమస్యలను ఆరా తీస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలోని ఉపాధ్యాయ నగర్‌లో రాకపోకలకు అడ్డుగా మారిన ఆక్రమణలు తొలగించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా వచ్చిన వినతుల మేరకు శనివారం ఉపాధ్యాయ నగర్, మానస సరోవర్ దారిని సందర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ నగర్ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఆక్రమణలున్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ క్రమంలో ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే సీసీ రోడ్లు లేని ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఖాళీగా ఉన్న ప్లాట్లలో చెత్తా చెదారం తొలగించి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు

చరిత్రలో నిలిచేలా టౌన్‌బ్యాంక్ అభివృద్ధి


మాట్లాడుతున్న వాసుయాదవ్

తిరుపతి మంగళం : తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంక్(టౌన్‌బ్యాంక్) 105ఏళ్ల చరిత్రలో నిలిచిపోయేలా తమ పాలకవర్గం అభివృద్ధి చేసిందని బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్ తెలిపారు. శనివారం తిరుపతి టౌన్‌బ్యాంక్‌లో మహాజన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వాసుయాదవ్ మాట్లాడుతూ సుమారు రూ. 40కోట్ల మొండి బకాయిలను వసూలు చేశామన్నారు. నగరంలో ఏటీఎంను కూడా ఏర్పాటు చేసిన ఘనత తమకే దక్కుతుందని వెల్లడించారు. ఖాతాదారులకు డివిడెంట్లు అందించేందుకు యత్నిస్తుంటే కూటమి నేతలు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో బ్యాంక్ ఎండీ శివకుమార్, డైరెక్టర్లు పోలిరెడ్డి నాగిరెడ్డి, వేమూరి జ్యోతిప్రకాష్, బ్రహ్మానందరెడ్డి, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, మాకం చంద్రయ్య, సురేష్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు చింతా రమేష్ పాల్గొన్నారు.

మేడసాని మోహన్‌కు సత్కారం


మోహన్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో శనివారం విద్వాన్ సింగరాజు సచ్చిదానందం శతజయంతి సార్థక సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అవధాని డాక్టర్ మేడసాని మోహన్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. డాక్టర్ భీమన్న పాల్గొన్నారు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో ..


లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

తిరుపతి రూరల్: పద్మావతి మహిళా వర్సిటీలో శనివారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధా కృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ ఉమ మాట్లాడుతూ మాజీ వీసీ రత్నకుమారి, విశ్రాంత ప్రొఫెసర్ ఎ. జ్యోతి , ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి పరిశోధన పురస్కారాలను అందిస్తున్నామని తెలిపారు.అనంతరం ప్రొఫెసర్లు టి. శోభా రాణికి, కె. ఉషారాణి, కుమారి చిట్టూరి, వి. నిర్మల, జి. రజిత, ఎం.వాణి, వై. శాంతి ప్రియకు అవార్డులు ప్రదానం చేశారు. రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు.

పాకాల : మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్ ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను హెచ్ఎం సుమలత ఘనంగా సత్కరించారు. అలాగే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పాకాల ప్లాటినం, దామలచెరువు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను క్లబ్ అధ్యక్షుడు తుల సీరామన్, రెడ్డిబాషా సత్కరించారు.

నిధుల దుర్వినియోగంపై ఆగ్రహం

తిరుపతి కల్చరల్ : నాగలాపురం మండలం వెల్లూరు, వెంబాకం, ఎస్ఎస్‌పురం , బీరకుప్పం, చిన్నాపట్టు పంచాయతీల ఇన్‌చార్జి కార్యదర్శి పరంధామ ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేశారని వెల్లూరు కార్యదర్శి యుగంధర్, ఎస్ఎస్‌పురం సర్పంచ్ కుమారుడు లీలాకృష్ణ మండిపడ్డారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 6 పంచాయతీలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న పరంధామ 15వ ఆర్థికసంఘం నిధుల్లో సుమారు రూ.35లక్షల నుంచి రూ.40లక్షల వరకు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

మోదీ తీరు మోసపూరితం


నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

తిరుపతి కల్చరల్ : అమెరికా సుంకాల విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీరు మోసపూరితంగా ఉందని, ట్రంప్ సామ్రాజ్యవాదానికి బీజేపీ తలొగ్గిందని వామపక్ష నేతలు మండిపడ్డారు. ట్రంప్ పన్నులు, మోదీ విధానాలపై శనివారం హెడ్‌పోస్టాఫీస్ వద్ద నిరసన తెలిపారు. నేతలు వందవాసి నాగరాజు, ఎ.రామానాయుడు, వెంకటరత్నం, టి.సుబ్రమణ్యం, వేణుగోపాల్, జయచంద్ర, మాధవ్, బుజ్జి, నరేంద్ర, రాజు. జయంత్రి, ప్రసాద్, రాము, శ్రీనివాసులు, పెంచలయ్య, విశ్వనాథ్, రాధాకృష్ణ, ఉదయ్, చలపతి, లోకేష్ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం

తిరుపతి అర్బన్ : చంద్రగిరి మండలం ఐతేపల్లె వద్ద శనివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా ప్రజారవాణాధికారి జగదీష్ తెలిపారు. 19మంది క్షతగాత్రులకు తిరుపతి రుయా చికిత్సలందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదానికి కారణాలు, నివారణ మార్గాలపై అధికారులతో చర్చించనున్నట్లు వివరించారు. అనంతరం డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, శ్రీకాళహస్తి డీఎం మునిచంద్ర, అలిపిరి డీఎం హరిబాబుతో కలిసి రుయాలో క్షతగాత్రులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

'తబ్లిక్ ఇజ్తేమా'ను సహించం

తిరుపతి కల్చరల్: తిరుపతి సమీపంలో తబ్లిక్ ఇజ్తేమాను నిర్వహించడం సహించమని, ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామీజీ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో అయన మాట్లాడారు. గల్ఫ్ దేశాలు సైతం నిషేధించిన తబ్లిక్ జమాద్ ఆధ్వర్యంలో చేపట్టే సభకు ప్రభుత్వం అనుమతివ్వడం సరికాదన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవ వేళ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రమాదకరమని మండిపడ్డారు. నేతలు కిరణ్‌కుమార్, చంద్రమౌళి, చేతన్ గాడి, బాలకృష్ణ, రమాదేవి పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యం

తిరుపతి కల్చరల్ : బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కామేశ్వరప్రసాద్, వేదం హరిప్రసాద్ తెలిపారు. శనివారం ఈ మేరకు బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన భువనేశ్వరప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. నేతలు కేఎల్ నారాయణరావు, మల్లికార్జున, కొత్తపల్లి విజయ్‌కుమార్, సింగరాజు నాగార్జున, కుశాల్ శ్రీపంత్ పాల్గొన్నారు.

తిరుచ్చిపై వెంకన్న విహారం


ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువనే స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. ఉత్సవర్లకు కనుల పండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం దేవదేవేరులను తిరుచ్చిపై కొలువుదీర్చి ఊరేగించారు.

నానో ఎరువులపై అవగాహన


పాకాల : మాట్లాడుతున్న ఏఓ హరితకుమారి

చంద్రగిరి : నానో యూరియా, నానో డీఏపీపై ఏఓ విజయ భాస్కర్ అవగాహన కల్పించారు. శనివారం బి.కొంగర వారిపల్లె, నారావారిపల్లె, చిన్నరామాపురం, కొండ్రెడ్డికండ్రిగలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

రసాయనాల వాడకం తగ్గించాలి

పాకాల :వ్యవసాయంలో రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని ఏఓ బి.హరితకుమారి సూచించారు. దామలచెరువు రైతుల సేవా కేంద్రంలో ఎరువులపై అవగాహన కల్పించారు.

సేంద్రియమే మేలు

తిరుపతి రూరల్: తనపల్లె రైతు సేవా కేంద్రంలో సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ ఏవీ సుబ్బారావు పాల్గొన్నారు.

అరకొరగా యూరియా సరఫరా

చంద్రగిరి : కూటమి ప్రభుత్వం అరకొరగా యూరియా సరఫరా చేసిందని, ఇందుకు నిరసనగా సోమవారం ప్రజా సంఘాల నేతృత్వంలో ఆందోళన చేపట్టనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మరో 15 రోజులు దాటితే యూరియా రైతులకు ఉపయోగపడదన్నారు. ప్రైవేట్ దుకాణాల్లో రూ.300 ఎరువుల బస్తాను రూ.450 విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఆందోళనకు రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.